# అమ్మో .... నువ్వెంత వాడివా బ్రహ్మా

మానవుల జీవిత విశేషాలను భవిష్యత్తును యోగాన్ని చెప్పేది జ్యోతి శ్శాస్త్రం. ఆ జాతకం చెప్పడానికి జాతక చక్రం కావాలి. ఆ జాతక చక్రం తయారు చేసేందుకు లగ్న నిర్ణయం-అందుకు పుట్టిన సమయం కావాలి. పుట్టిన సమయాన్ని బట్టి మానవుల భూత భవిష్యత్ వర్తమాన విషయాలు చెప్పగలరు. జాతకాన్ని నిశితంగా పరిశీలించి ఫలితాలు చెప్పడంలో శాస్త్రవేత్త పొరపాటు పడవచ్చునేమో కానీ శాస్త్రం తప్పుకాదు. జన్మ కాలాన్ని బట్టి ఆధానలగ్నం నిర్ణయిస్తారు అంటే మానవుడు మాతృ గర్భంలో నిక్షిప్తమైన సమయం. ఏతావాతా తేలిందేమిటంటే స్త్రీ పురుషుల కలయికకు కూడా మంచి సమయం కావాలి. పుత్ర యజ్ఞమది ఆవేశం ఫలితంగా పుట్టే సంతానం ఎలా వుంటుందో శ్రీకాళహస్తి మాహాత్మ్యం చెబుతుంది. నమ్మినా నమ్మక పోయినా కలయిక సమయంలో భార్యాభర్తల చిత్త వృత్తులు సంతానానికి వస్తాయి. నేటి జన్యు శాస్త్ర వేత్తలు కూడా ఇదే నిర్ణయిస్తారు.

శ్రీకాళహస్తి మాహాత్మ్య కథ చూద్దాం—

ఒకప్పుడు సృష్టికర్త అయిన బ్రహ్మకు సృష్టి కార్యం మీద విపరీతమైన వాంఛ పుట్టుకొచ్చిందట అందుకని భార్య సరస్వతితో "నా వాంఛ చాపల్యం తీరాలంటే నువ్వు నూరు రూపాలు దాల్చాలి. నువ్వలా వంద సరస్వతులుగా రూపాంతరం చెందితే నేను శతానందుడిని అవుతా !" అని అడిగాడు. అలాగే సరస్వతి వంద "భాషాయోష" ల రూపం ధరించింది.

బ్రహ్మ బ్రహ్మానంద భరితుడయినారు.

ఇళ్ళల్లో, కొండ చరియాల్లో, మేడలమీద, నదీ తీరాల్లో, పూపొదరిళ్ళలో, దేశం, కాలం సమయం, అసమయం అనే విషయాలు మరచి కామాంధుడై కోరిక

తీరాలా తిరిగేడు. అరవై గడియలు రతి ఆనందంతో గడిపేశాడు. పుణ్యం. పాపం అనుకోకుండా అదే పనిగా కామలోలుడయ్యాడు.

ఫలితంగా —

ఆయనకి ముప్పయి వేలమంది రాక్షసులు పుట్టుకొచ్చారు. వాళ్ళంతా క్రూరులు ధూర్తులు దోషులు, జగత్ ద్రోహులు, మహా భయంకరులు, ధర్మ విరోధులు, పరస్త్రీ సుఖలాలసులు, ఆచార భ్రష్టులు, లోక కంటకులు, నిర్దయులు. పుట్టీ పుట్టగానే తమ పుట్టుకకు కారకుడైన సృష్టికర్త వద్దకు వెళ్ళారు. మొక్కారు. "ప్రజా పతీ! చెప్పండి, శ్రీ మహాలక్ష్మిని చెరపట్టి తెమ్మంటారా? వెండి కొండను పిండి చెయ్యమంటారా ? సూర్యుడ్ని మింగమంటారా ? సముద్రాలను పీల్చ మంటారా ? శేష శాయిని ఒక ఆట ఆడించమంటారా ? భూమిని పెకిలించ మంటారా ? మృత్యు కోరలు విరగదన్న మంటారా ? యముడ్ని పారదోలాలా? ఏడు కొండలూ పైకెగరవేసి బంతాట ఆడుకోమంటారా?" అని అడిగారు.

ఒక్కో యుగంలో ఒక్కో రాక్షసుడు ఒక్కో దుర్మార్గం చేశాడు. హిరణ్యాక్షుడు భూమిని పెకిలించాడు. వరాహ రూపంతో దాన్ని విష్ణువు ఆపేడు.. అలా ఒక్కొక్కరి కోసం విష్ణువు ఒక్కో అవతారం ఎత్తాల్సి వచ్చింది.

మరి వీళ్లో !
అవన్నీ తామే చేస్తాం అంటున్నారు.
వీళ్ళను చంపి లోకాల్ని రక్షించాలంటే !

అంతా విన్న బ్రహ్మ నాలుగు తలలు పట్టుకున్నాడు "హత విధీ !" అనుకున్నాడు. కళ్ళకు కావరం కమ్మి కామాంధ కారంతో చెరలాడినందులకు ఈ చేటు అనుకుని - తన పనికి తానే వగచి – అందర్నీ వింధ్యకు పొమ్మని ఆజ్ఞాపించాడు.

వాళ్ళు అమిత ఉత్సాహంతో వెళ్ళారు అక్కడ —

జంతువులను చంపారు. మింగారు. ఋషి పత్నులను చెరపట్టారు దేవతల నగరాలను ముట్టడించారు. మునుల తపస్సు చెడగొట్టారు. పురుషుడెదురైతే చంపేవాళ్ళు.

స్త్రీ ఎదురైతే చెరిచే వాళ్ళు. సంపదలు దోచేవాళ్ళు లోకంలో సుఖ శాంతులు లేకుండా చేశారు. చేస్తే —

భూదేవి వెళ్ళి మొర పెట్టుకుంది.

అది విని బ్రహ్మ కోపించాడు. ఆ కోపంలోంచి "ఉగ్రుడు" అనే వీరుడు పుట్టుకొచ్చాడు. ఆతడికి ఉగ్రసింహ రథాన్నీ, అస్త్రాలను, శస్త్రాలను, వజ్ర కవచాన్ని ఇచ్చి - "కుమారా! యుద్ధంతో ఆ ముప్పై వేల మందినీ చంపెయ్, నా కొడుకులు అనుకోవద్దు, నీ అన్నలు అని సంకోచించవద్దు—వాళ్ళు లోక కంటకులు. వాళ్ళవల్ల లోకాలన్నీ తల కిందులవుతున్నాయి. వెళ్ళు చంపిరా!" అని పంపాడు.

వాళ్ళతో యుద్ధంచేసి అందర్నీ చంపి తిరగొచ్చి తండ్రి ఎదుట నిలిచాడు ఉగ్రుడు.

ఆ కొడుకుల దుష్ట వర్తనం ఈ కొడుకు వాళ్ళను చంపడం అంతా మనసులో మెదిలి బ్రహ్మ మనస్సులో కోపం పుట్టింది మళ్ళీ. ఆ క్రోధంలో ఉగ్రుడూ భస్మమయ్యాడు.

కొడుకులు పోవడం - పుత్ర హత్యా దోషం చుట్టు కోవడంతో శివుడి గూర్చి తపస్సు చేశాడు బ్రహ్మ -

కథ అంతే అయినా — గమనించాల్సింది - సంతాన కారణం ఆ సమయంలో తల్లి దండ్రుల మనస్తత్వం.... తత్ఫలితం

—o—